


EVENING EDITION

నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

4 PM

www.suryaa.com

మంగళవారం

09 ఏప్రిల్ 2024

పేజీలు: 02


షడ్రుచుల సమ్మేళనం, దేశం కాలమాన మార్పులకి ఆలవానం ఉగాది. ఈ నూతన సంవత్సరం ప్రతిఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు పంచాలి అని మన స్ఫూర్తిగా కోరుకుంటూ... మీకు మరియు మీ కుటుంబ సభ్యులకు శ్రీ క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు

- సూర్య






## ప్రధాని నరేంద్రమోదీపై ట్రాన్స్‌జెండర్ పోటీ!

వారణాసి లోక్‌సభ నియోజకవర్గం ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అక్కడ నుంచి బీజేపీ అభ్యర్థిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పోటీ చేస్తున్నారని కాదు. క్కడ నుంచి ఇతర ప్రధాన పార్టీలతో పాటు ఓ ట్రాన్స్‌జెండర్ కూడా బరిలో దిగారు. అఖిల భారత హిందూ మహాసభ తరఫున మహామండలేశ్వర్ హేమంగ్ సఖి మా పోటీ చేస్తున్నారు. వారణాసితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని 20 లోక్‌సభ స్థానాలలో అఖిల భారత హిందూ మహాసభ పోటీ చేస్తున్నది.వారణాసి నుంచి కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌రాయ్ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో ప్రధానమంత్రి మోదీ 63 శాతం ఓట్లతో ఘన విజయం సాధించారు. రెండో స్థానంలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన షాలినీ యాదవ్ నిలిచారు. కాంగ్రెస్ మూడో స్థానంలో ఉంది. ఈసారి మాత్రం ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్-సమాజ్‌వాదీ పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయి. ఇక హేమాంగ్ సఖి మా విషయానికి వస్తే ఆమె గుజరాత్‌లోని బరోడాలో జన్మించారు. ఆమె తండ్రి సినిమా డిస్ట్రిబ్యూటర్. అందుకే ఆమె కుటుంబం ముంబాయికి వెళ్లాల్సి వచ్చింది. కాన్వెంట్ స్కూల్‌లో చదువుకున్న హేమాంగి సఖికి చిన్నప్పడే కష్టాలు ఎదురయ్యాయి. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో స్కూల్ చదువు మధ్యలోనే వదిలేయాల్సి వచ్చింది. కొన్ని చిత్రాలలో నటించిన ఆమె కొన్ని ప్రముఖ టీవీ షోలను కూడా నిర్వహించారు. ముంబాయిలో తన ఇంటికి దగ్గరలో ఉన్న ఇస్కాన్ టెంపుల్‌కు తరచూ వెళ్లేవారు. అలా శ్రీకృష్ణపరమాత్ముడిపై ఆమెకు భక్తి మొదలయ్యింది. అది మధురభక్తిగా మారింది. వెంటనే బృందావనంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత ఆమె హేమాంగి సఖి అయ్యారు. ప్రపంచంలోని మొట్టమొదటి ట్రాన్స్‌జెండర్ భగవద్గీత బోధకురాలు హేమాంగి కావడం విశేషం. 2019 ఫిబ్రవరిలో జరిగిన కుంభంలో ఆచార్య మహామండలేశ్వర్‌గా ఆమె పట్టాభిషేకం జరిగింది. అఖిల భారతీయ సాధు సమాజ్ ఆమెకు భగవత్భూషణ్ మహామండలేశ్వర్ బిరుదును ఇచ్చి సత్కరించింది.

# మయాంక్ యాదవ్ ఐపీఎల్ నయా సెన్సేషన్

ఐపీఎల్ 2024లో లక్నో సూపర్ జెయింట్స్ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ సంచలనం సృష్టించాడు. ఈ సీజన్‌లో అత్యంత వేగవంతమైన బంతిని బౌలింగ్ చేశాడు. తన వేగం, ఖచ్చితమైన లైన్ లెంగ్త్‌తో, ఈ బౌలర్ ప్రతి ఒక్కరినీ తన అభిమానిగా మార్చుకున్నాడు. మాజీ చీఫ్ సెలెక్టర్ MSK ప్రసాద్ కూడా మయాంక్ ఆటకు ఫిదా అయ్యాడు. మయాంక్ T20 ప్రపంచ కప్ జట్టులో చోటు సంపాదించాలని అభిప్రాయపడ్డాడు. MSK ప్రసాద్ ప్రస్తుతం లక్నో సూపర్‌జెయింట్స్‌కు కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. మయాంక్ వయసు 21 ఏళ్లు అయినప్పటికీ పెద్ద వేదికపై ఒత్తిడిని బాగా తట్టుకోగలిగాడని తెలిపాడు. IPL అనేది ఒక పెద్ద వేదిక. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన స్టార్లు అందులో ఆడతారు. వారికి వ్యతిరేకంగా బౌలింగ్ చేయడం, ఒత్తిడిని భరించడం చాలా పెద్ద విషయం. మయాంక్ అటువంటి బౌలర్, అతను ఇప్పటి వరకు ఒత్తిడిని బాగా తట్టుకుని, మంచి లైన్ లెంగ్త్‌తో నిలకడగా బౌలింగ్ చేస్తున్నాడు.

మయాంక్‌కు టీ20 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కాలి..

మయాంక్ తన పేస్‌తో ఇప్పటికే అత్యుత్తమ ఆటగాళ్లను ఇబ్బంది పెట్టాడని ఈ మాజీ ప్లేయర్ చెప్పుకొచ్చాడు. బ్యాటర్లు మయాంక్ పేస్‌కు వ్యతిరేకంగా బ్యాట్‌ని తీసుకురాలేకపోతే, అతను సహాయకారిగా నిరూపిస్తాడని నేను భావిస్తున్నాను. భారత బౌలింగ్‌ను కూడా దగ్గరనుంచి చూస్తాడు. ముఖ్యంగా షమీ ఇప్పుడు అవుట్ కావడంతో, సెలెక్టర్లు బుమ్రా, సిరాజ్ తర్వాత మూడవ ఫాస్ట్ బౌలర్ కోసం చూస్తున్నారు. అలాంటి పేస్, కచ్చితత్వం ఉన్న ఎవరైనా టీ20 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకోవాలి. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఎల్ఎస్‌జీ కోసం కేవలం ఒక ఓవర్ బౌలింగ్ చేసిన తర్వాత మయాంక్ సైడ్ స్ట్రెయిన్‌తో బాధపడి మైదానం నుంచి వెళ్లిపోయాడు. మయాంక్ నాల్గవ ఓవర్ బౌలింగ్ చేయడానికి వచ్చాడు. అయితే LSG ఫిజియోతో మైదానం వెలుపల కార్ట్ చేయబడే ముందు ఓవర్‌లో కేవలం 140 kmph వేగాన్ని రెండుసార్లు అధిగమించగలిగాడు. అతను ఆ ఓవర్‌లో 13 పరుగులు ఇచ్చాడు. ఆ తర్వాత మైదానంలోకి తిరిగి రాలేదు. ఎందుకంటే GTపై LSG 33 పరుగుల విజయాన్ని నమోదు చేసింది.




## షడ్రుచుల ఉగాది పచ్చడితో ఆరోగ్యానికి ఎంతో మేలు!

ఉగాది పచ్చడిలో వాడే పదార్థాలతో ఆరోగ్యానికి మంచి జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. బెల్లం శరీరంలోని విషపదార్థాల్ని బయటికి పంపించడంలో సహకరిస్తుంది. వేపాకు రక్తాన్ని శుద్ధి చేసి అనేక చర్మ వ్యాధులను నివారిస్తుంది. మామిడి వడదెబ్బ తగలకుండా, డీహైడ్రేషన్ బారినుంచి కాపాడుతుంది. కారం జీర్ణశక్తిని పెంచి, బరువును తగ్గిస్తుంది. ఉప్పు నీరసాన్ని తరిమికొడుతుంది. చింతపండు శరీరంలోని కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది.



## రైతులకు ఎంతో ప్రీతికరమైన పండుగ.. ఉగాది

ప్రస్తుత సమాజంలో పండుగల ప్రాముఖ్యత గురించి చాలా మందికి తెలియడం లేదు. కానీ అసలైన కొత్త సంవత్సరం అంటే ఉగాది. భారతీయ సాంప్రదాయం ప్రకారం శుక్ల పాడ్యమి రోజున సృష్టి నిర్మాణం జరిగిందని పూర్వీకులు చెబుతుంటారు. అయితే అన్నదాతలు ఉగాది రోజున.. పొలం వద్ద నూతన పనులు ప్రారంభిస్తారు. దుక్కి దున్ని వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. రైతులతో పాటు తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ ఈ పండుగను ప్రీతికరంగా భావిస్తారు.






## డీఎంకే నేతలు, సినీ ప్రముఖుల ఇళ్లలో ఈడీ, ఐటీ దాడులు

తమిళనాడులో జాతీయ దర్యాప్తు సంస్థల దాడులు కలకలం రేపుతున్నాయి. అధికార పార్టీ డీఎంకేకు చెందిన కొందరు నేతలతో పాటు పలువురు సినీ ప్రముఖుల ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహిస్తోంది. అదే సమయంలో.. మరోవైపు కొందరు వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్ని లక్ష్యంగా చేసుకుని ఆదాయ పన్నుల శాఖ దాడులు కొనసాగిస్తోంది. చెన్నై సహా 35కు పైగా ప్రాంతాల్లో ఈడీ మంగళవారం ఉదయం ఏకకాలంలో సోదాలకు దిగింది. డీఎంకే బహిష్కృత నేత.. సినీ నిర్మాత జాఫర్ సాదిక్‌కు సంబంధించిన ఆఫీసులతో పాటు, అతనితో పరిచయం ఉన్నవాళ్ల ఇళ్లు, ఆఫీసులకు ఈడీ బృందాలు చేరుకున్నాయి. ఇందులో డీఎంకే నేతలతో పాటు పలువురు సినీ ప్రముఖులు ఉన్నారు. భారీ డ్రగ్స్ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ విచారణలో భాగంగా ఈడీ ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## కవిత జ్యుడిషియల్ రిమాండ్ పొడిగింపు



ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కు బిగ్ షాక్ తగిలింది. కల్వకుంట్ల కవిత కవిత జ్యుడిషియల్ రిమాండ్ పొడిగించారు. ఈ నెల 23 వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడిషియల్ రిమాండ్ పొడగించింది రౌస్ అవెన్యూ కోర్టు. ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీ లాండరింగ్ కేసు దర్యాప్తు కొనసాగుతుందని, కవిత జ్యుడీషియల్ కస్టడీ 14 రోజులు పొడిగించాలని కోర్టును కోరింది ఈడీ. కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగించడానికి ఈడీ వద్ద కొత్తగా ఏమి లేవని కవిత తరపు న్యాయవాది రానా తెలిపారు. 2022 నుంచి కేసు దర్యాప్తు సాగుతుంది కవిత ప్రభావితం చేసే వ్యక్తి అని అంటున్నారు.. అలా ఏమి లేదని కోర్టుకు రానా తెలిపారు. ఇక ఈ తరుణంలోనే కల్వకుంట్ల కవిత కవిత జ్యుడిషియల్ రిమాండ్ పొడిగించారు. ఈ నెల 23 వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడిషియల్ రిమాండ్ పొడగించింది రౌస్ అవెన్యూ కోర్టు.



## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. నేటి నుంచి 3 ఆఫర్లు

తెలుగు సంవత్సరం ఉగాది నుంచి మెట్రో రైలు ప్రయాణికులకు 3 కొత్త ఆఫర్లను ప్రకటిస్తున్నామని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మెట్రో ప్రయాణికుల కోసం 3 ఆఫర్‌లు 6 నెలల పాటు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డ్, మెట్రో స్టూడెంట్ పాస్, సూపర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్‌లను మెట్రో ప్రయాణికులు ఈ నెల 9 నుంచే వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ... మెట్రో ప్రయాణికులకు కోసం ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ సరికొత్తగా కస్టమర్ లాయల్టీ ప్రోగ్రాంను పరిచయం చేస్తోందన్నారు. ఇందులో తరచుగా మెట్రోలో ప్రయాణించే వారికి పూర్తి ఆకర్షణీయంగా ఉంటుందని, ఎక్కువగా మెట్రో సేవలు వినియోగించుకుంటే ఎక్కువ రివార్డులు పొందవచ్చన్నారు. కొత్తగా ప్రారంభించిన కస్టమర్ లాయల్టీ ప్రోగ్రాం ద్వారా మెట్రో ప్రయాణికులు ఎంతో లబ్ధి పొందుతారని ఎల్ అండ్ టీ మెట్రో ఎం.డీ, సీఈఓ కేవీబీ రెడ్డి తెలిపారు.



## శ్రీ క్రోధినామ సంవత్సర రాశిఫలాలు

| | | | | |
|---|---|---|---|---|
| వృషభరాశి | 02 | 08 | 07 | 03 |
| మిథునం | 05 | 05 | 03 | 06 |
| కర్కాటకం | 14 | 02 | 06 | 06 |
| సింహం | 02 | 14 | 02 | 02 |
| కన్య | 05 | 05 | 05 | 02 |
| తుల | 02 | 01 | 01 | 05 |
| వృశ్చికం | 08 | 14 | 04 | 05 |
| ధనుస్సు | 11 | 05 | 07 | 05 |
| మకరం | 14 | 14 | 03 | 01 |
| కుంభం | 14 | 14 | 06 | 01 |
| మీనం | 11 | 05 | 02 | 04 |

## సూర్యాపేట రోడ్డు ప్రమాదం.. 5కు చేరిన మృతుల సంఖ్య

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంజనపురి కాలనీ వద్ద గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మోక్షిత్(7) మంగళవారం ఉదయయం మృతి చెందాడు. కాగా, ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన కారు ఈ ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో నలుగురు మృతి చెందారు. 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద స్థలంలో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా, దవాఖానలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మరణించగా మంగళవారం మోక్షిత్ మృతి చెందాడు. మృతులు జిల్లాలోని అర్వపల్లి మండలానికి చెందిన వారిగా గుర్తించారు. రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు మరణించడంతో తల్లిదండ్రుల రోదనల మిన్నంటాయి.




## పాకిస్థాన్‌లో బాంబు పేలుళ్లు.. ముగ్గురు మృతి

పాకిస్థాన్‌లో రంజాన్ షాపింగ్‌లే లక్ష్యంగా ముష్కరులు రెచ్చిపోయారు. బలూచిస్థాన్‌లో ఉగ్రవాదులు ఘోరమైన పేలుళ్లకు తెగబడ్డారు. ఈ పేలుళ్లలో ముగ్గురు మృతి చెందగా..20 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఒక పోలీసు కూడా ఉన్నారు. కుచ్లక్‌లోని మసీదు, ఖుజ్దార్ మార్కెట్ లక్ష్యంగా బాంబు దాడులు చోటుచేసుకున్నాయి. పేలుళ్లలో ఐఈడీలు ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో తీవ్రవాద కార్యకలాపాలు విపరీతంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఏ గ్రూప్ కూడా పేలుళ్లకు బాధ్యత వహిస్తూ ప్రకటన చేయలేదు.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# UGADI SPECIAL MOVIE POSTERS































## చరిత్ర సృష్టించిన జడ్డూ




కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఐపీఎల్ 2024 22వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. కోల్‌కతాపై జడేజా 3 వికెట్లు, రెండు క్యాచ్‌లు తీసుకున్నాడు. ఈ అద్భుతమైన ప్రదర్శన ఆధారంగా, అతను ఇప్పటి వరకు IPLలో మరే ఆటగాడు చేయలేని పనిని చేశాడు. చెన్నై ఆల్‌రౌండర్ ఐపీఎల్‌లో 1000 పరుగులు, 100 వికెట్లు, 100 క్యాచ్‌లు సాధించి, ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా నిలిచాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కేకేఆర్‌ను జడేజా తన భీకర బౌలింగ్‌తో 9 వికెట్లకు 137 పరుగులకే పరిమితం చేశాడు. అతను సునీల్ నరైన్, అంగ్క్రిష్ రఘువంశీ, వెంకటేష్ అయ్యర్‌లను పెవిలియన్ చేర్చాడు. జడేజా 4 ఓవర్లలో 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అంతే కాకుండా ఫీల్డింగ్‌లోనూ అద్భుతాలు చేశాడు. తుషార్ దేశ్ పాండే వేసిన బంతికి ఫిల్ సాల్ట్, ముస్తాఫిజుర్ రెహమాన్ వేసిన బంతికి కేకేఆర్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ క్యాచ్ పట్టి షాక్ ఇచ్చాడు.

ఐపీఎల్‌లో జడేజా ప్రదర్శన..

కోల్‌కతాపై జడేజా తన తొలి ఓవర్‌లోనే రఘువంశీ, సునీల్ నరైన్‌లను అవుట్ చేశాడు. ఒక్క ఓవర్‌లో కేకేఆర్ వెన్ను విరిచాడు. దీని తర్వాత 9వ ఓవర్లో వెంకటేష్ అయ్యర్‌ను అవుట్ చేశాడు. దీంతో జడేజా మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. అంతకు ముందు తొలి నాలుగు మ్యాచ్‌ల్లో తడబడ్డాడు. ఒక్క వికెట్ మాత్రమే తీయగలిగాడు. చెపాక్‌లో బౌలింగ్ చేయడం కూడా జడేజా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అతని బౌలింగ్ మాత్రమే కాదు, అందరి చూపు అతని బ్యాటింగ్‌పైనే ఉంది. దీనికి ముందు, గత నాలుగు మ్యాచ్‌ల్లో నాటౌట్‌గా 31 పరుగులు చేయడం అతని అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా నిలిచింది.

## శ్రీశైలం ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలం మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. మల్లన్న, భ్రమరాంబికా దేవిలను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే ఆలయాల్లో పూజలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా అలంకార దర్శనానికి మాత్రమే భక్తులను అనుతిస్తున్నారు. కాగా, మల్లన్న దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతున్నది. భక్తుల రద్దీతో శ్రీశైలంలోని పురవీధులు కిటకిటలాడతున్నాయి. శివ నామస్మరణతో శ్రీశైల గిరులు మార్మోగిపోతున్నాయి.

## 'మహా'కూటమిలో సీట్ల సర్దుబాటు ఫైనల్




మహారాష్ట్రలోని మహాకూటమిలో సీట్ల సర్దుబాటు పూర్తయ్యింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఎవరెన్ని స్థానాల్లో పోటీ చేయాలనే విషయంలో శివసేన (ఉద్ధవ్ థాకరే వర్గం), ఎన్సీపీ (శరద్‌పవార్ వర్గం), కాంగ్రెస్ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ఈ మేరకు మహాకూటమి నేతలు ఉమ్మడి ఒక ప్రకటన చేశారు. మొత్తానికి 21-17-10 ఫార్ములాను ఫైనల్ చేసినట్లు తెలిపింది. మహాకూటమి ప్రకటన ప్రకారం.. ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన అత్యధికంగా 21 స్థానాల్లో బరిలో దిగుతోంది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ 17 స్థానాల్లో పోటీ చేయనుంది. ఇక శరద్‌పవార్ వర్గం ఎన్సీపీ 10 స్థానాల్లో పోటీ పడనుంది. ఇన్నాళ్లు సాంగ్లీ లోక్‌సభ స్థానం కోసం ఉద్ధవ్ శివసేన, కాంగ్రెస్ పోటీపడ్డాయి. సాంగ్లీలో మాకు పట్టుందని, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారని, కాబట్టి ఆ స్థానంలో మా అభ్యర్థే పోటీలో ఉండాలని కాంగ్రెస్ వాదిస్తూ వచ్చింది. కానీ ఉద్ధవ్ శివసేన అందుకు ససేమిరా అంది. సాంగ్లీ స్థానం తమకే కావాలని పట్టుబట్టింది. ఎట్టకేలకు కాంగ్రెస్ మెట్టుదిగడంతో సర్దుబాటు ఫైనల్ అయ్యింది. దాంతో సాంగ్లీ నుంచి శివసేన (యూబీటీ).. రెజ్లర్ చంద్రహార్ పాటిల్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించింది. అయితే అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి వసంత్‌దాదా పాటిల్ మనవడు విశాల్ పాటిల్‌ను సాంగ్లీ అభ్యర్థిగా ఖరారు చేసింది. ఇప్పుడు సాంగ్లీ సీటు పొత్తులో భాగంగా శివసేనకు వెళ్లడంతో స్థానిక కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్‌ను కలిశారు. విశాల్ పాటిల్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించి వెనక్కి తగ్గడంతో పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం నెలకొందని తెలిపారు. దాంతో విశాల్ పాటిల్‌ను రాజ్యసభకు పంపిస్తామని కాంగ్రెస్ హైకమాండ్ హామీ ఇచ్చింది. దాంతో సమస్య సద్దుమణిగింది.



## పిఠాపురం నుంచే విజయకేతనం..
## ఉగాది వేడుకల్లో పవన్



జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలులో నిర్వహించిన ఉత్సవాలకు సోదరుడు నాగబాబు, తెదేపా నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన నేతలతో కలిసి హాజరయ్యారు. పవన్‌కు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రజలంతా బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. పిఠాపురం నుంచే విజయకేతనం ఎగురవేయబోతున్నామని.. క్రోధి నామ సంవత్సరంలో కూటమి ప్రభుత్వాన్ని స్థాపిస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రజలకు మేలు జరగాలని.. రైతులు, మహిళలకు మరింత ప్రోత్సాహం లభించాలన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు రావాలని ఆకాంక్షించారు.